క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఇరుముడి పూజలు



పెద్దకొత్తపల్లి: మండలంలోని మరికల్‌లో మంగళవారం శివాలయంలో ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివమాలధారులు ఇరుముడులు కట్టుకొని శ్రీశైలం క్షేత్రానికి బయలుదేరారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, రాఘవేందర్, కృష్ణమోహన్, ఈశ్వర్, మహేష్‌లు పాల్గొన్నారు.

శివమాలధారులకు అన్నప్రసాదం పంపిణీ

బిజినేపల్లి: శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కాలినడకన వెళ్లే శివ మాలధారులకు మండలంలోని పాలెం వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం అన్నప్రసాదం పంపిణీ చేశారు. గౌతాపురం విజయలక్ష్మినరసింహస్వామి ఆలయ పీఠాధిపతి జగద్గురు హరి బాలానంద దాసు ఆధ్వర్యంలో 500 మందికి పైగా శివస్వాములకు మడితో కూడిన అన్నదానం చేశారు. కొండాపూర్ మాజీ ఉప సర్పంచ్ అజిలాపూర్ చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెల్దండ: మండలంలోని లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ షబ్బీర్ అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించి ఓదార్చారు. అల్లాజీ సమకూర్చిన రూ.5వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సోమయ్య, మల్లయ్య, యాసిన్, రఫీ, షరీఫ్, రమేష్, దేవయ్య, తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు డీఎస్పీకి ఆహ్వానం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని సుభాష్‌నగర్‌లో లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 23 నుంచి నిర్వహించే బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని మంగళవారం డీఎస్పీ వెంకటేశ్వర్లుకు, సీఐ నాగార్జున, ఎస్‌ఐ మాధవరెడ్డిలకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. మూడు రోజులపాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలలో భాగంగా వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తునట్లు వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రెటరీ కల్వ హరికృష్ణ వివరించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, రాజేందర్ తదితరులు ఉన్నారు.

ముగిసిన మహిళా సంఘాల శిక్షణ



తాడూరు: మండలంలోని చెర్ల ఇటిక్యాలలో మహిళా సంఘాల సభ్యులకు సీఆర్పీలు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ మంగళవారం ముగిసింది. సీఆర్పీలు భారతి, అమీదాబేగం, రజియాబేగంలు మహిళా సంఘాల బలోపేతం కోసం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంచసూత్రాలు, నిలిచిన సంఘాలను తిరిగి పునర్‌ప్రారంభించడం, సంఘంలో లేని మహిళలను గుర్తించి కొత్త సంఘాలు చేయడం, ఆన్‌లైన్ పనులను మొబైల్‌లలో నమోదు చేయడం, సభ్యులకు వ్యక్తిగత పాస్ పుస్తకాలు, సామాజిక కార్యక్రమాలు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఏపీఎం బాలచందర్, సిబ్బంది జిలేక, పద్మజ, గీత, చెన్నమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలలో మాజీ సర్పంచ్ ఆవ మల్లయ్య మృతిచెందాడు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్‌గా గ్రామానికి చేసిన సేవలను కొనియాడారు. నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

చేతిపంపునకు మరమ్మతులు

కొల్లాపూర్: పట్టణంలోని 12 వవార్డులో ఉన్న చేతిపంపునకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు గుంద్రాతి కిరణ్‌తేజ గౌడ్ మంగళవారం తన స్వంత డబ్బులతో మరమ్మతు చేయించారు. రూ.18 వేలు వెచ్చించి చేతిపంపునకు అవసరమైన కొత్తపైపులు కొనుగోలు చేసి ఏర్పాటు చేయించారు. వంగ రాజశేఖర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, పసుపుల నర్సింహ్మ, ఎక్బాల్, ఖాదర్ పాషా, బోరెల్లి మహేష్ తదితరులు ఉన్నారు.



పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

తాడూరు: పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించారు. అనంతరం గుట్టలపల్లిలో ఇందిరమ్మ నమూనా ఇంటికి భూమి పూజ చేశారు. పొల్కూరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడం కోసం సీఎం రేవంత్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మల్లయ్య, బుచ్చయ్య, రమేష్, వల్లభ్‌రెడ్డి, శ్రీనివాసులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

కొనసాగుతున్న రిలే దీక్షలు



మాట్లాడుతున్న చిలుకా బాల్‌రెడ్డి

చారకొండ: మండల కేంద్రంలో బైపాస్ బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం నాటికి 8వ రోజుకు చేరుకుంది. సీపీఎం సీనియర్ నాయకుడు చిలుకా బాల్‌రెడ్డి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పరశురాములు, వంగూరు, మండల కార్యదర్శి వెంకటయ్య, చారకొండ మండల సీపీఎం కార్యదర్శి బాలస్వామి బాధితులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నాయకుడు బాల్‌రెడ్డి మాట్లాడారు. బైపాస్ నిర్మాణంలో అధికారులు ఎలాంటి సమాచారం లేకుండా 29 మంది ఇళ్లను నేలమట్టం చేయడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో వారికి ఇచ్చిన నష్టపరిహారం ఏమాత్రం సరిపోదని, ఇంటిస్థలం కూడ రాదని విమర్శించారు. బాధితులకు నూతన స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని, రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బాధితులు అలివేలు, చిట్టెమ్మ, వెంకటమ్మ, అనసూయమ్మ, లాలమ్మ, విజయ్, తదితరులు ఉన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఉప్పునుంతల: మండలంలో రైతులకు ఇచ్చిన విత్తనపు వేరుశనగ ద్వారా వచ్చిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని మంగళవారం స్థానిక గోడౌన్ వద్దకు వచ్చిన ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, ఏఈఓ జాన్సీలతో కలిసి రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం యాసంగి సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ పంటకు వైరస్ తెగుళ్లు సోకి పంట దిగుబడి పూర్తిగా తగ్గిందని వివరించారు. సంస్థ ద్వారా అందించిన టీసీజీఎస్ 1694 రకం వేరుశనగ విత్తనంలో 15 శాతం కల్తీ విత్తనాలు రావడంతో పంట నష్టపోవాల్సి వచ్చిందని తెలిపారు. బైబ్యాక్ తీసుకునే వేరుశనగ పంటకు సంబంధించిన డబ్బులను మూడు విడుతలలో కాకుండ నెలవ్యవధిలోనే రెండు విడతలలో చెల్లించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రైతు కట్టా అనంతరెడ్డి, రైతులు వెంకట్‌రెడ్డి, దుద్దు జంగయ్య, డొంక వెంకటయ్య, వెంకటేష్, సైదులు తదితరులు ఉన్నారు.

తూతూమంత్రంగా రైతు నేస్తం

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి ఏఓ, ఏఈఓ, ఓ మహిళా మాత్రమే హాజరయ్యారు. సంబంధిత అధికారులు గైర్హాజరు కావడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయంపై అవగాహన కల్పించాల్సిన అధికారులే సకాలంలో రాకుంటే రైతులను ఎలా చైతన్యం చేస్తారని పలువురు రైతులు ప్రశ్నించారు.

విద్యా సదస్సు విజయవంతం చేయండి



కందనూలు: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో 20న నిర్వహించే విద్యాసదస్సు విజయవంతం చేయాలని సరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు మిడిదొడ్డి శివశంకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ముఖ్య వక్తలుగా విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర అధ్యక్షుడు డాక్టర్ చామర్తి ఉమామహేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. కార్యదర్శి కందూరి బాలరాజు, సహకార కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

భగవద్గీత గ్రంథాలపై ప్రచారం

తెలకపల్లి: త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలపై మంగళవారం మండలంలోని కారువంగలో ఆ కమిటీ సభ్యులు ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రంథాలను పంపిణీ చేశారు. మనోహర్, సాయి శేఖర్, భాస్కర్, వరుణ్, రాము, నరసింహ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పశు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెంట్లవెల్లి: రైతులు పశువైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారిణి మౌనిక అన్నారు. మంగళవారం మండలంలోని మాధవస్వామి నగర్‌లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్స శిబిరం నిర్వహించారు. రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్ శ్రీనివాసులు, గోపాల మిత్రులు నరసింహ, ఖదీర్‌పాషా, శివుడు, శివరాములు, సూరిబాబు, ట్రైనీ శ్రీజ పాల్గొన్నారు.

భక్తిభావంతో మెలగాలి



కల్వకుర్తి రూరల్: ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆచారి అన్నారు. మంగళవారం పట్టణంలోని కైలాసం గుట్టపై వెలసిన మడెలయ్య స్వామి ఉత్సవాలలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆచారిని సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, పట్టణ అధ్యక్షుడు బాబీ దేవ్, మాజీ కౌన్సిలర్ విజయ్, రజక సంఘం నాయకులు ఉన్నారు.

రగ్గుల పంపిణీ

లింగాల: మండలంలోని ఎర్రపెంటకు చెందిన ఉపాధి పనులు నిర్వహించే 30 చెంచు కుటుంబాలకు దాత హైదరాబాద్‌కు చెందిన ఆశలత మంగళవారం రగ్గులను సమకూర్చారు. ఈ మేరకు మంగళవారం ఉపాధి పథకం సిబ్బంది బాలీశ్వర్ చెంచులకు రగ్గులను పంపిణీ చేశారు. మల్లేష్, చిన్న లింగయ్య, సన్నయ్య, చెంచులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



కల్వకుర్తి ఎల్లికల్ పాఠశాలలో..

కోడేరు: మండలంలోని రాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్‌గా నందిని, జిల్లా విద్యాధికారిగా భార్గవి, మండల విద్యాధికారిగా బి. భార్గవి, ప్రధానోపాధ్యాయులుగా భవ్యలీలతో పాటు 40మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌శర్మ, ఉపాధ్యాయులు ఆంజనేయులు, గట్టయ్య, మల్లికార్జున్, ప్రభాకర్, శ్రీశైలం, మల్లికార్జున్, శ్రీలత, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో రాజాపూర్ పాఠశాల విద్యార్థులు

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

కల్వకుర్తి: మండలంలోని ఎల్లికల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ఉపాధ్యాయుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలుగా సంజన, మండల విద్యాశాఖ అధికారిగా శివతేజ, కలెక్టర్‌గా కవితలు వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం జమీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ



కొల్లాపూర్: పాత పెన్షన్ విధానం అమలు కోసం 2న టీఎస్‌సీపీఎస్‌ఈయూ చేపట్టిన యుద్ధభేరి పోస్టర్లను మంగళవారం పట్టణంలోని ఆర్‌ఐడీ ప్రభుత్వ పాఠశాలలో ఎంఈఓ ఇమ్మానుయేల్ ఆవిష్కరించారు. అనంతరం టీఎస్ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర సహ అధ్యక్షుడు బృంగి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా పింఛన్ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులను గందరగోళానికి ప్రభుత్వాలు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాత పెన్షన్ విధానంతోనే ఉద్యోగులకు న్యాయం చేకూరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగులు యుద్ధభేరికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వరప్రసాద్, గణేష్, బంగారయ్య, వెంకటకృష్ణ, కుసుమలత, పవిత్ర, సౌమ్య, అలివేలు, జాబేర్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతి



అచ్చంపేట: జడ్చర్లకు తరలించిన గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలను యధావిధిగా అచ్చంపేటలో కొనసాగేవిధంగా కృషి చేయాలని కోరుతూ మంగళవారం ఎమ్మెల్యే డాక్టరు చిక్కుడు వంశీకృష్ణకు గిరిజన సేవా సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. 2019లో అప్పటి ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఇక్కడి నుంచి డిగ్రీ కళాశాల తరలిపోవడానికి ప్రధాన పాత్ర పోషించారని గిరిజన సంఘం నాయకులు వివరించారు. గిరిజన బాలుర డిగ్రీకళాశాలతో పాటు మన్ననూర్ నుంచి మొయినాబాద్‌కు తరలించిన సీఓఈ కళాశాలను తీసుకొచ్చేందుకు అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ భరోసా ఇచ్చారు. చత్రునాయక్, శ్రీనివాస్‌నాయక్, నరసింహనాయక్, వినోద్ నాయక్, జాన్, శత్రు, బలరాం, దశరథం, భరత్, రమేష్, శివ, రాహుల్ పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



కోడేరు: మండల కేంద్రంలోని వడ్డెరవాడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎంఈఓ భాస్కర్‌శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠాలు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సీఆర్పీ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రైతులపై కేటీఆర్‌ది కపట ప్రేమ

కల్వకుర్తి: రైతులపై కేటీఆర్‌ది కపట ప్రేమ అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయతి విజయకుమార్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఫార్ములా ఈ కార్ కేసు నుంచి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కేటీఆర్ రైతు ధర్నా నిర్వహించారని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 6,121 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. కేటీఆర్ మాటలు ఎవరు నమ్మే స్థితిలో లేరని పేర్కొన్నారు.

యూరియా అధికంగా వాడొద్దు

తెలకపల్లి: పంటలకు యూరియా అధికంగా వాడొద్దని ఏఓ నర్మద అన్నారు. మంగళవారం మండలంలోని రాకొండ, లక్నారం, పెద్దూరు గ్రామాలలో వరి, మొక్కజొన్న పంటలను ఆమె పరిశీలించారు. రైతుల పొలాల వద్దకు వెళ్లి ఏఏ పంటలు సాగు చేస్తున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు వరి పొలాల్లో ఎక్కువ మోతాదులో యూరియాను వాడుతున్నారని, మోతాదుకు మించి వాడటం వలన పంట దిగుబడి సక్రమంగా రాదని వివరించారు. యూరియా వాడటంపై అవగాహన కల్పించారు. వరి నాటిన 45 నుంచి 55 రోజుల వరకు ఒక ఎకరాకు 15 నుంచి 20 కిలోల వరకు పొటాషియం, 20 కిలోల యూరియాను కలిపి వరి పొలంలో చల్లుకోవాలన్నారు. సరైన సమయంలో వరినాట్లు వేసుకొని తగు సూచనలు పాటిస్తే మంచి దిగుబడి వస్తుందని సూచించారు.



వరి పంటలను పరిశీలిస్తున్న ఏఓ నర్మద

ప్రతి మంగళవారం మండల పరిధిలోని పెద్దూరు గ్రామ రైతువేదికలో వ్యవసాయ నిపుణుల ద్వారా వివిధ పంటలు, వాటిని సాగు చేసే విధానాలు, యాంత్రీకరణ మొదలైన విషయాలపై నిర్వహించే రైతు నేస్తం ప్రోగ్రాంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఈఓ శ్రావ్య, ఆయ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

శాస్త్ర విజ్ఞానంపై మక్కువ పెంచుకోవాలి

తాడూరు: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని జిల్లా ఏఎంఓ శర్ఫుద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని మేడిపూర్ ఉన్నత పాఠశాలలో ఫోరం ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. శాస్త్రీయ పరిజ్ఞానం మెరుగుపర్చుకోవాలన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఎంపికైన ముగ్గురు విద్యార్థులకు రాష్ట్రస్థాయి ఆన్‌లైన్ పరీక్ష పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, హెచ్‌ఎం త్యాగరాజు గౌడ్, కృష్ణారెడ్డి, బాలకృష్ణ, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ చేయించడం చట్ట విరుద్ధం



ఉప్పునుంతల: వెట్టిచాకిరీ చేయించడం చట్ట విరుద్ధమని తహసీల్దార్ ప్రమీల అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మానవ అక్రమ రవాణా నివారణపై ఉమెన్ సేఫ్టీ వింగ్ అండ్ లేబర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్‌ను తహసీల్దార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్వై సుజాత, నేషనల్ ఆదివాసి సాలిడారిటీ కౌన్సిల్ లీగల్ అడ్వయిజర్ విజయరాజు, పీపుల్స్ యూనియన్ ఫర్ లిబర్టీ అండ్ జస్టిస్ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ భూపతి, ఎఫ్‌ఎస్‌డీ సంస్థ ప్రతినిధులు మహేష్, వెంకటరాజు, జయప్రకాష్, కోనేరు సంస్థ ప్రతినిధి అంజి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలి

చారకొండ: ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ పేర్కొన్నారు. మండలంలోని జూపల్లిలో మంగళవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బస్టాఫ్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వేసవిలో వృద్ధులకు, ప్రయాణికులకు దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఆటో యూనియన్ సభ్యులను ఎస్పీ అభినందించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు విష్ణువర్ధన్ రెడ్డి, నాగార్జున, ఎస్‌ఐలు, ఆటో యూనియన్ సభ్యులు మహ్మద్, మల్లేష్, రాములు, గౌస్, ఆంజనేయులు, కృష్ణ, సాయిలు గౌడ్, తిర్పతయ్య, కుర్మయ్య, కడారి ఆంజనేయులు, మహేష్, గెల్వయ్య ఉన్నారు.

కేసు నమోదు

ఉప్పునుంతల: మండల కేంద్రం సమీపంలో సోమవారం రాత్రి గ్రామానికి చెందిన రైతు చింతగాళ్ల వెంకటయ్యను వెనక నుంచి బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు మంగళవారం బాధితుడి కూతురు చింతగాళ్ల శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రేడ్యానాయక్ తెలిపారు. రైతు వెంకటయ్య రాత్రి 10 గంటల సమయంలో తన పొలం వద్ద నుంచి కాలినడకన రోడ్డు పక్క నుంచి ఇంటికి వస్తుండగా జప్తీసదగోడుకు చెందిన కురుమేటి శ్రీను వెనక వైపు నుంచి వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తల, కాళ్ల చేతులకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

మినీ డీసీఎం డ్రైవర్‌పై..

తెలకపల్లి: మండలంలోని రాకొండ గ్రామానికి చెందిన పొట్టే పెద్ద పర్వతాలును మినీ డీసీఎం ఢీకొని సోమవారం మృతి చెందిన ఘటన విధితమే. మంగళవారం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుధీర్ తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీ కొన్న ఘటనలో..

బల్మూర్: మండలంలోని కొండనాగుల వద్ద ఈ నెల 16న గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీ కొన్న ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమాదేవి తెలిపారు. కొండనాగుల గ్రామానికి చెందిన బుచ్చన్న రోడ్డుపై నడుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బుచ్చన్న తలకు తీవ్ర గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుచ్చన్న భార్య లక్ష్మీదేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉత్సవాల నిర్వహణకు రూ.25వేలు సాయం



మన్ననూర్: పదర మండలం రాయలగండి క్షేత్రంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవ స్వామి ఉత్సవాలలో మౌలిక వసతులు కల్పనకు సీబీఎం ట్రస్టు చైర్మన్, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ మంగళవారం రూ.25 వేలు అందజేశారు. మార్చి నెలలో నిర్వహించే ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు అచ్చంపేటలో ఆమెను కలిశారు. తాత్కాలికంగా పనులు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు.

‘విద్యార్థులు సమయం వృథా చేయొద్దు’

పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని ఎంఈఓ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. మంగళవారం మండలంలోని చిక్కేపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల సన్నద్ధతపై పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాల్లో పదో తరగతి పునాదిలాంటిదన్నారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధమైతే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. అనంతరం ప్రముఖ రచయిత, సైకాలజిస్ట్ యండమూరి వీరేంద్రనాథ్ రచించిన టాప్ ర్యాంక్ నూరు సూత్రాలు పుస్తకాలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం శివయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ

రైతు దీక్షకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు



వెల్దండ నుంచి ఆమన్‌గల్లుకు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కల్వకుర్తి రూరల్/తిమ్మాజిపేట/వెల్దండ: కల్వకుర్తి మండలంలోని మార్చాల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు తలసాని కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆమనగల్లులో నిర్వహించిన కేటీఆర్ సభకు తరలి వెళ్లారు. కార్యక్రమంలో లింగం, కిషోర్ ఉన్నారు. తిమ్మాజిపేట మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తిమ్మాజిపేటకు చేరుకొని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అక్కడి నుంచి ఆమన్‌గల్ ధర్నాకు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు జోగు, ప్రదీప్, నాయకులు రవీంద్రనాథ్‌రెడ్డి, రాందేవ్‌రెడ్డి, శ్రీనుయాదవ్, గోపిగౌడ్, హుసేనీ, వెంకటేష్, కాళ్లరాజు, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఆమన్‌గల్‌లో నిర్వహించిన రైతు దీక్షకు వెల్దండ మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్లారు. మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, నాయకులు ఐజాక్, చంద్రమోహన్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నిరంజన్, ఆనందర్, లింగం ముదిరాజ్, కొండల్, ప్రవీణ్, దేవేందర్, శేఖర్, ఎంఎస్‌గౌడు, వెంకటయ్య, శేఖర్, తదితరులు ఉన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083
నాగర్‌కర్నూల్ జి. సంపత్ కుమార్ - 88865 67081
కొల్లాపూర్ వై. కురుమూర్తి - 79979 58205
అచ్చంపేట/కల్వకుర్తి యమ్. విజయ్ - 99630 23777

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్ 9951602829
పి. మధుసూదన్‌గౌడ్: 90100 06785